నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి 1

మంగళవారం 07 మార్చి 2023

ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్‌పై ఫిర్యాదు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని కౌన్సిలర్లు ఆర్డీఓ శ్రీనునాయక్ వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ.. ఎల్లారెడ్డిలో మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న జగ్ జీవన్ ఈ నెల 6 వ తేదీ నుంచి విధులకు రావటం లేదని విధులకు హాజరు కాకా వేరే వాళ్లకు కూడా ఇంచార్జ్ ఇవ్వలేదన్నారు. మున్సిపల్ కమిషనర్ లేకపోవటం వలన మున్సిపల్ పరిధిలోని చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయని పనులు చేయలేకపోతున్నామని అదేవిధంగా మున్సిపల్‌లో నీటి కొరత కుక్కల బెడద కోతుల బెడద డ్రైనేజీ సమస్యలు చేయలేకపోతున్నామని కౌన్సిలర్లు వాపోయారు. ఆర్డీవో తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అల్లం శ్రీను, నీల కంఠం తదితరులు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇంటర్ పర్యావరణ విద్య పరీక్షను పరిశీలించిన నోడల్ ఆఫీసర్

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సోమవారం నిర్వహించిన పర్యావరణ విద్య పరీక్షను నోడల్ ఆఫీసర్ షేక్ సలాం పరిశీలించారు. విద్యార్థులు భయం లేకుండా స్వేచ్ఛగా పరీక్షను రాయాలని విద్యార్థులకు సూచించారు. ఈ పరీక్షకు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర విద్యార్థులు 94 మంది పరీక్షకు హాజరయ్యారని ప్రిన్సిపాల్ భానుమతి తెలిపారు. అనంతరం నోడల్ ఆఫీసర్‌ను అధ్యాపక బృందం సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజశేఖర్, రాజేందర్, లింగమయ్య, అరవింద్, దశరథ్, నీరజ, అనిత, ఇస్రాత్లు పాల్గొన్నారు.

దొంగలముఠాతో

రైతుల పరేషాన్

- తరచూ ట్రాన్స్‌ఫార్మర్ల విద్యుత్ పరికరాలు చోరీ
- కంటిమీద కునుకులేకుండా చేస్తున్న ముఠా
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దొంగల ముఠా

కామారెడ్డి జిల్లాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల విద్యుత్ పరికరాలు తరచూ చోరీకి గురవుతున్నాయి. ఓ దొంగల ముఠానే ఇదంతా చేస్తోందని తెలుస్తోంది. ఈ వరుస దొంగతనాలతో పంటను రక్షించుకోవాల్సిన రైతులు.. ట్రాన్స్‌ఫార్మర్లను రక్షించుకునే పనిలో పడ్డారు. దీంతో వారికి కంటి మీద కునుకు లేకుండా పోతోంది. మరోవైపు పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు సైతం రైతులు అప్రమత్తంగా ఉండాలని.. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనుమానాస్పద వ్యక్తులు తిరిగితే తమకు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు.

నవతెలంగాణ-గాంధారి

కామారెడ్డి జిల్లాలోని గాంధారి, లింగంపేట్, తాడ్వాయి, వివిధ మండలాల్లోని గ్రామాల్లో గత 15 రోజులుగా 17 ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు జరిగినట్టు విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. రైతులు జాగ్రత్తగా ఉండాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు. పలు గ్రామాల్లో పరిసర ప్రాంత వ్యవసాయ బోరు బావుల వద్ద వినియోగించుకునే ట్రాన్స్‌ఫార్మర్లను ఓ దొంగలముఠా దొంగిలించింది. రెండు రోజుల క్రితం లింగంపేట్ మండలంలోని నల్లమడుగు గ్రామంలో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించారు. ఆదివారం రాత్రి గాంధారి గ్రామంలో బ్రాహ్మణపల్లి రోడ్డులో, అలాగే బ్రాహ్మణపల్లిలోని వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌లను దొంగిలించారు. అయితే దొంగల ముఠా ప్రధానంగా గాంధారి, లింగంపేట్ మండల పరిసర ప్రాంతాలలోనే తిరుగుచున్నారని, కావున వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు తమ తమ ట్రాన్స్‌ఫార్మర్లు ఎప్పటికప్పుడు బోరు వద్దకు వెళ్ళినప్పుడు అటువైపు చూడవలసిందిగా విద్యుత్ శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. వ్యవసాయ బోర్ల వద్ద ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగిన వెంటనే పోలీస్, విద్యుత్ శాఖ వారికి సమాచారం ఇవ్వాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఎస్ఐ కోణారెడ్డి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల, పరిసర ప్రాంతా గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కోణారెడ్డి సూచించారు. గతవారం రోజుల నుంచి మండల, వివిధ మండలాల చుట్టూ ట్రాన్స్‌ఫార్మర్ దొంగల ముఠా బీభత్సాన్ని సృష్టిస్తుందని, 20 నుంచి 30 ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్, కాయల్ దొంగతనాలు చేస్తుందని తెలిపారు. పోలీసుల తరఫున రెండు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలని పోలీసు వారి సహకారం ఉంటుందని వివరించారు. గుర్తు తెలియని వ్యక్తులు పొలాల వైపు గాని గ్రామాల వైపు గాని వచ్చినట్టు అనిపిస్తే వెంటనే 100 నంబర్‌కు లేదా ఎస్సై పెద్దకొడప్‌గల్ 8712686179 నెంబర్‌కు ఫోన్‌చేసి తెలుపాలని సూచించారు.

మహిళలకు

అన్ని రంగాల్లో పెద్దపీట



చీరలను పంపిణీ చేస్తున్న మంత్రి

- మహిళ కేంద్రంగా కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు
- మహిళా దినోత్సవ వేడుకల్లో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మహిళ కేంద్రంగానే రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వేల్పూర్ మండల కేంద్రంలోని సాయిబాబా టెంపుల్ ఫంక్షన్ హాల్‌లో బాల్కొండ నియోజకవర్గ అంగన్వాడీ టీచర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వీవోఏలు, సీసీలు, ఆర్‌పిలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లతో మంత్రి తన సతీమణి నీరజా రెడ్డితో కలిసి మహిళ దినోత్సవం వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సొంత తన ఖర్చులతో సుమారు 1000 మందికి చీరలు పంపిణీ చేశారు. అనంతరం సతీసమేతంగా వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళా సాధికారత కోసం సీఎం కేసీఆర్ అంతలా ప్రపంచంలోనే మరెవరు ఆలోచన చేయలేరని స్పష్టం చేశారు. బిడ్డ కడుపులో ఉన్నప్పుడు కేసీఆర్ కిట్‌తో మొదలు వృద్యాప్యంలో ఆసరా పెన్షన్ వరకు ఎన్నో మానవీయ కోణ కార్యక్రమాలు నేడు కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో అమలవుతున్నాయని అన్నారు. ఒక్క బాల్కొండ నియోజకవర్గంలోనే ప్రతినెలా 28వేల మంది బీడీ కార్మికులకు 5కోట్ల 65 లక్షలు, 2016మంది ఒంటరి మహిళలకు 4లక్షల 65వేలు, 12వేల765మంది వితంతువులకు 2కోట్ల 57లక్షలు, 4242 వృద్ధాప్య పెన్షన్లకు 85 లక్షలు, 10వేల మందికి షాదీముబారక్, కళ్యాణలక్ష్మి కింద 100 కోట్లు, కేసీఆర్ కిట్ కింద 12 వేల చొప్పున ఇప్పటి వరకు నేరుగా బాల్కొండ నియోజకవర్గ మహిళకు 900 కోట్ల లబ్ది జరిగిందని మంత్రి వెల్లడించారు. ఇవే కాకుండా 19 నూతన అంగన్వాడి భవనాలు, 3కోట్లతో 52 మహిళ భవనాలు నిర్మించామన్నారు. ముఖ్యమంత్రి కెసీఆర్ గతంలో అంగన్వాడి జీతాలు 4500 ఉంటే దాన్ని 10వేల 500 చేసుకొని మళ్ళీ 13,650 చేశారని గుర్తు చేశారు. ఏఎన్ఎంల జీతాలు 4వేలు ఉంటే 27వేలు చేశారని, ఆశావర్కర్లకు 1500 ఉంటే 9,750 చేశారని, హోంగార్డులకు 12వేలు ఉంటే 30వేలు, వీవోఏలకు 2000 ఉంటే 5,900, అంగన్వాడి హెల్పర్స్‌కు 4500 ఉంటే 7వేల 500 చేశారని తెలిపారు. మహిళలు అనుకుంటే సాధ్యం కానిది ఏది లేదని, వారికి కావాల్సింది ప్రోత్సాహం మాత్రమేనన్నారు. అందుకే అన్ని రంగాల్లో మహిళలకు కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని మంత్రి వేముల పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో మంత్రి సతీమణి వేముల నీరజారెడ్డి, బాల్కొండ నియోజకవర్గ మహిళా ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ సత్యం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని దాల్మల్కంపల్లి శబ్దాల్పూర్ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా తమ గ్రామాలకు రహదారులు పూర్తిగా అధ్వానంగా మారి పాదచారులకు ద్విచక్ర వాహనదారులకు అలాగే గ్రామస్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని ప్రజలు తెలిపారు. ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఇచ్చిన హామీ మేరకు విడతలవారీగా రెండు గ్రామాలకు గాను దాదాపుగా రూ.55 లక్షల నిధులను మంజూరు చేశామని, రూ.20 లక్షల నిధులతో రోడ్డు పనుల నిర్మాణాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీష్ కుమార్, సర్పంచ్ సాయిరాములు, నారాయణ, షరీఫ్ బాయ్, మల్లారెడ్డి, ఎరుకల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

9న తైబజార్ వేలం

నవతెలంగాణ-బోధన్

బోధన్ మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 9వ తేదీన తైబజార్, పశు వధశాలకు సంబంధించిన వేలంపాట నిర్వహించనున్నట్టు, కావున ఆసక్తి గలవారు మార్చి 9వ తేదీ ఉదయం 11 గంటలకు హాజరుకావాలని మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పంటల పరిశీలన



గాంధారి : పంటలు పరిశీలన

నవతెలంగాణ-తాడ్వాయి/గాంధారి

మండలంలోని ఎర్రపహడ్ గ్రామంలో సోమవారం వరి పంటలను మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని రైతులందరూ వరి పంటలో ఆశిస్తున్న మోగి పురుగు, చవుడు, నాచు, జింక్ లోపం ఇతర చీడ పీడల గురించి యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారి రాకేష్, రైతులు మల్లేష్, సంగారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

గాంధారి : మండలంలోని పెట్‌సంగెం, మతు సంగెం, రాంపూర్ గడ్డ గ్రామాలలో వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి నరేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి పొలాల్లో అగ్గితెగులు గుర్తించినట్టు తెలిపారు. కార్యక్రమంలో మాతు సంగెం సర్పంచ్ కమ్మరి భాస్కర్, ఉప సర్పంచ్ సంగరావు, ఏఈఓ షోయబ్ అహ్మద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు రోడ్డు పన్ను చెల్లించాలి

- వెహికల్ మోటార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

నవతెలంగాణ-లింగంపేట్

వాహనదారులు తప్పకుండా రోడ్డు పన్నులు చెల్లించాలని వెహికల్ మోటార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం లింగంపేట సమీపంలోని ఎల్లారెడ్డి కామారెడ్డి ప్రధాన రహదారిపై పలు వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులు రోడ్ టాక్స్ చెల్లించని యెడల వారి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. గడువు లోపల చెల్లించాలని ఆయన సూచించారు. ఐదు వాహనాలను తనిఖీ చేశారు వాహనాలకు సంబంధించిన పేపర్లను పరిశీలించారు.

జిల్లా మహిళలు ఆదర్శంగా నిలవాలి



మహిళా ఉద్యోగినికి సన్మానం



జ్ఞాపికలతో మహిళా ఉద్యోగులు

- స్వయం ఉపాధి కల్పించుకోవాలి
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

జిల్లా మహిళలు స్వయం ఉపాధి కల్పించుకొని రాష్ట్రస్థాయిలో ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్లో సోమవారం టీఎన్జీవోఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చేపల, తేనెటీగల పెంపకం, డ్రోన్ యంత్రం ద్వారా పురుగు మందుల పిచికారి వంటి కార్యక్రమాలను చేపట్టి జిల్లా మహిళలు స్వయం సమృద్ధిని సాధిస్తున్నారని తెలిపారు. ఆర్థికంగా స్వాలంబన సాధించే దిశగా పయనిస్తున్నారని చెప్పారు. అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు రాణించాలని పేర్కొన్నారు.

మహిళ ఉద్యోగులు పనిచేసే చోట, బహిరంగ ప్రదేశాల్లో వేధింపులకు గురి అయితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు. ఉత్తమ సేవలందించిన మహిళా ఉద్యోగులకు సన్మానం చేసి జ్ఞాపికలను అందజేశారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, కార్యదర్శి బి.సాయిలు, ప్రతినిధులు దేవరాజు, సంతోష్ కుమార్, లక్ష్మణ్, రాజ్యలక్ష్మి, కల్పన, సుజాత, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

- జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

ప్రజావాణి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తామన్నారు. వాటిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. కాగా మొత్తం 51 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో రవీందర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు సాయి భుజంగరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి



గ్రంథాలయ పుస్తకాలు అందజేత

నవతెలంగాణ-దోమకొండ

గ్రంథాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ అన్నారు. బీబీపేట మండల కేంద్రంలోని రూ.55లక్షలతో నిర్మించిన గ్రంథాలయం భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ప్రస్తుత పోటీ ప్రపంచంలో గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని కష్టపడి చదువుకొని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలన్నారు. నిరుద్యోగులు, యువత కోసం ప్రభుత్వం గ్రంథాలయాలను ఏర్పాటు చేయడంతో ఎలాంటి ఇబ్బందులు ఉండవని, యువత లక్ష్యముతో చదువుకొని ఉన్నత స్థాయిలో నిలిచి భవితరాలకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. ఎంపీపీ బాలమణి, జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, డీసీయంయస్ వైస్ చైర్మన్ ఇంద్ర సేన రెడ్డి, వ్యాపార వేత్త సుభాష్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మి, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సాగు చేస్తున్న భూమికి పట్టాలివ్వాలి

- కలెక్టర్‌కు విన్నవించిన గ్రామస్తులు

నవతెలంగాణ-బోధన్

సాలురా మండలంలోని మందర్న గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబాల నిరుపేదలు గత 30 సంవత్సరాల నుంచి గ్రామంలో గల ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్నారని, వారికి పట్టాలని ఇచ్చి ఆదుకోవాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయానికి మందర్న గ్రామస్తులు సోమవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా సర్పంచ్ రావుబా గంగాధర్ మాట్లాడుతూ.. నిరుపేద ఎస్సీ, బీసీ రైతులు 30 సంవత్సరాల నుంచి సాగుచేసుకుంటున్న భూమికి ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను కోల్పోతున్నారని, దాంతో రైతుల తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి వెంట దళిత సంఘం నాయకులు వాగ్మారే నాగురావు తదితరులున్నారు.

ఒంటిచేత్తో ఓడించాడు

- కుస్తీలో వికలాంగుడి ప్రతిభ



కుస్తీ పోటీలో ఒకచేయితో తలపడుతున్న వికలాంగుడు

నవతెలంగాణ-బోధన్

హోలీ పండుగను పురస్కరించుకొని సోమవారం సాలూర మండల కేంద్రంలో నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా కొనసాగాయి. ఈ కుస్తీ పోటీలో మహారాష్ట్ర కర్కెల్లి గ్రామానికి చెందిన ఒకచేయి కోల్పోయిన మల్లయోధుడు కుస్తీలో తలపడి విజయం సాధించాడు. సమీప గ్రామాల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్నాటక నుంచి మల్లయోధులు తరలివచ్చి కుస్తీ పోటీల్లో తలపడ్డారు. రెండు గంటల పాటు సాగిన కుస్తీ పోటీలు ఉత్కంఠగా కొనసాగాయి. విజయం సాధించిన మల్లయోధులకు గ్రామపెద్దలు నగదు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బుద్దె రాజేశ్వర్, సొసైటీ చైర్మెన్ జనార్ధన్, సురేష్ పటేల్, వెంకటి పటేల్, శంకర్ పటేల్, రమేష్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

మూలమలుపు ఉంది.. జాగ్రత్త

- బోర్డు ఏర్పాటు చేసిన పోలీస్‌శాఖ
- నవతెలంగాణ కథనానికి స్పందన



పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోర్డు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఫైర్ స్టేషన్ ప్రాంతంలో గల ప్రధాన రహదారిపై మూలమలుపు ప్రమాదకరంగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో సోమవారం నవతెలంగాణ దినపత్రికలో 'ప్రమాదకర మలుపు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎస్ఐ గణేష్ స్పందించి వెంటనే సోమవారం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. వాహనదారులు జాగ్రత్తలు పాటించేలా 'మూలమలుపు ఉన్నది.. జాగ్రత్తా..' అనే హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతేదీ..?



నాసిరకంగా చేపడుతున్న పనులు

నవతెలంగాణ-వర్ని

చందూర్ మండల కేంద్రంలోని సీసీ రోడ్ల నిర్మాణ పనులు నాణ్యత పాటించడం లేదని ప్రజల నుంచి ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీసీ రోడ్డులో ముందుగా 40ఎంఎల్ కంకర వేసి రోలింగ్ చేయాలి. అనంతరం నీటితో బాగా తడిపి పాలిథీన్ కవర్ వేసి పైనుంచి 20ఎంఎల్ కంకర, ఇసుక, సిమెంట్‌తో కలిపి సీసీ రోడ్డు వేయవలసి ఉండగా.. అవేవీ నిబంధనలు పాటించకుండా కాంట్రాక్టర్‌లకు ఇష్టానుసారంగా సీసీ రోడ్డు పనులు చేపడుతున్నారు. నాణ్యత పాటించకపోతే కొన్నిరోజులకే పగుళ్ల ఏర్పడే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు. అధికారులు సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతలు పాటించేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్
మంగళవారం 07 మార్చి 2023

8న ఉద్యోగ మేళా

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలకోసం ఈ నెల 8 న ఉద్యోగ మేళా నిర్వహిస్తునట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఇట్టి ఉద్యోగమేళాకు రిలయన్స్ నిప్పాస్ లైఫ్ ఇన్సూరెన్స్ నిజామాబాద్ Reliance Nippon Life Insurance నిజామాబాద్ జిల్లా పరిధిలోనే లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ఉద్యోగాలకోసం అని పేర్కొన్నారు. విద్యార్హత ఏదైనా డిగ్రీ, వయోపరిమితి 30ఏండ్లపైన ఉండవలెనని తెలిపారు. ఆసక్తి గల మహిళలు జిల్లా ఉపాధి కార్యాలయం శివాజీ నగర్ నిజామాబాద్‌లో హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు 9581768413, 9959456793 వివరాలు బయో డేటా, ఆధార్ కార్డు, పాసుపోర్టు సైజు ఫోటో, సర్టిఫికెట్స్ వెంట తీసుకొని రావాలని తెలిపారు.

పేదల కళ్లల్లో ఆనందం నింపడానికే కంటివెలుగు

నవతెలంగాణ-మెండోర

పేదల కళ్ళల్లో ఆనందం నింపడం కోసమే కంటి వెలుగు కార్యక్రమం అని చాకిర్యాల్ సర్పంచ్ ఎడ్ల లింగు దేవన్న అన్నారు. సోమవారం మండలంలోని చాకిర్యల్ గ్రామంలో ఎంపీడీఓ శ్రీనివాస్ సమక్షంలో రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో కంటిచూపు సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని రూపొందించారని అన్నారు. ప్రభుత్వం ఉచితంగా ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి, కళ్లఅద్దాలు, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు, మందులను అందజేస్తుందని తెలిపారు. 18 ఏళ్ల పైబడిన ప్రతీఒక్కరు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, సెక్రెటరీ ప్రవీణ్, ఆరోగ్య శాఖ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు

సదుపాయాలు కల్పించాలి

- ప్రజావాణి పెండింగ్ ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి
- అధికారులకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచన
- ప్రజావాణికి 80 ఫిర్యాదులు



ప్రజావాణిలో కలెక్టర్ వినతులు అందజేస్తున్న ఫిర్యాదుదారులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు నిర్వహిస్తున్న కూలీలకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సంబంధిత అధికారులకు సూచించారు. పని ప్రదేశాల్లో తప్పనిసరిగా తాగు నీటి వసతి, నీడను కల్పించేలా తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ఈ నెల 8న ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని, స్థానిక శాసన సభ్యులు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. ఈ నెల 13 న సీపీఆర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించాలని, అన్ని వర్గాల వారిని భాగస్వాములు చేయాలని అన్నారు. ఇంటర్మీడియట్, పదవ తరగతి వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాటు చేయాలని, ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్ ఉన్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 80 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్, డీపీఓ జయసుధ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్ లైన్ లో అప్లోడ్ చేయడంతో పాటు అర్జీదారులకు సమాచారం అందించాలని సూచించారు. అన్ని శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులే విధిగా ప్రజావాణికి హాజరు కావాలని, ఒకవేళ అత్యవసరంగా రాలేని పరిస్థితి ఉంటే జిల్లా పాలనాధికారి అనుమతి తీసుకోవాలని సూచించారు.

10 వరకు పరీక్షల ఫీజు గడువు పొడిగింపు

- జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్

నవతెలంగాణ-కంఠేశ్వర్

సంచాలకులు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటి, హైదరాబాద్, ఏప్రిల్, మే - 2023లో జరుగబోయే పదవ తరగతి (ఎస్ఎస్‌సి), ఇంటర్మీడియట్ పరీక్షల ఫీజు చెల్లించుటకు చివరి అవకాశం (తత్కాల్) 10 వరకు గడువుని పొడిగించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.వి దుర్గా ప్రసాద్, జిల్లా కో-ఆర్డినేటర్ తుల రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని స్టడీ సెంటర్ల సమన్వయ కర్తలు, సంబంధిత అభ్యాసకులకు తెలియజేసి ఫీజు చెల్లించే విధంగా చూడాలని పేర్కొన్నారు. తత్కాల్ పరీక్ష ఫీజు ఈనెల 10 వరకు చెల్లించాలని, పదవ తరగతి (తత్కాల్) 500 రూపాయలు ప్రతి సబ్జెక్టుకు 100, ఇంటర్మీడియట్ (తత్కాల్) 1000 రూపాయలు, ప్రతి థియరీ, ప్రాక్టికల్ సబ్జెక్టుకు-150రూపాయలు చెల్లించాలని తెలిపారు. పరీక్ష ఫీజును టీఎస్ ఆన్‌లైన్, ఏపీ ఆన్‌లైన్, మీసేవ సెంటర్‌లలో చెల్లించవచ్చునని పేర్కొన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ తుల రవీందర్ సెల్ నెం 8008403518 ద్వారా సంప్రదించాలని తెలిపారు.

శ్మశానవాటికలో వసతులు కల్పిండంలేదు..

- పంచాయతీ కార్యదర్శిని నిలదీసిన యువకులు



శ్మశాన వాటికలో వసతులపై కార్యదర్శికి తెలుపుతున్న యువకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

శ్మశాన వాటిక సుందరీకరణ గాలికి వదిలేయడం ఎంత మాత్రం సబబు కాదని, కనీస వసతులు కల్పించడంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామపంచాయతి కార్యదర్శి విఫలం చెందారని గ్రామానికి చెందిన యువకులు సోమవారం పంచాయతీ కార్యదర్శిని నిలదీశారు. మండల కేంద్రంలోని ఘనపూర్ గ్రామానికి చెందిన శ్మశానవటికలో సరైన సదుపాయాలు లేవని దాని కోసం గ్రామపంచాయతీకి పలు మార్లు విన్నవించామని తెలిపారు. యువకులు పంచాయతీ కార్యదర్శి సునీల్‌ను వెంటపెట్టుకుని శ్మశాన వాటిక వద్దకు వెళ్లి అక్కడున్న సమస్యలను కార్యదర్శికి వివరించారు. దానికి స్పందించిన కార్యదర్శి గతంలో గ్రామ పంచాయతీ నుండి మోటారు వేశామని, కానీ దొంగలు ఎత్తుకెళ్లిపోయారన్నారు. మళ్ళీ వారంలో శ్మశానవటికలో నీళ్ల సదుపాయం కల్పించి అక్కడ క్లీనింగ్ చేపిస్తామని అన్నారు. అనంతరం గేటు నుండి కాష్టం వరకు మొరం వేస్తామన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో చలివేంద్రాన్ని సర్పంచ్ ఎన్నం రాజారెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... రూరల్ ఎమ్మెల్యే, టీఎస్ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఆర్టీసీ చైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన నుండి, ఆర్టీసీ లాభాల బాటలో నడుస్తుందన్నారు. ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు మంచినీటిని ఏర్పాటు చేయాలని ఆదేశించగా చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రయాణ ప్రాంగణం కంట్రోలర్ గాండ్ల గంగాధర్, మంగలి గంగాధర్, మోహన్, నరేందర్, రాజేశ్వర్, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలు

- మేయర్ దండు నీతు కిరణ్
- యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రం



యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రం వద్ద మాట్లాడుతున్న మేయర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కుక్కల బెడద నియంత్రణకు చర్యలు చేపడుతున్నామని మేయర్ దండు నీతూ కిరణ్ తెలిపారు. కొద్ది రోజులుగా నిజామాబాద్ జిల్లాలో కుక్కల బెడదతో ఎదురువుతున్న ఇబ్బందులు, నగర ప్రజల నుండి వస్తున్న ఫిర్యాదుల దృష్ట్యా కుక్కల నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నగరంలోని ప్రజల నుండి వస్తున్న పిర్యాదులను పరిష్కరించాటానికి, కుక్కల్లో పునరుత్పత్తిని నియంత్రణకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గత రెండు రోజులుగా ఈ బృందం వారు 20కి పైగా కుక్కలను కేంద్రానికి తరలించినట్లు తెలిపారు. ఈ బృందం వారు కాలనీల్లో ఉన్న వీధి కుక్కలను గుర్తించి తీసుకెళ్లి వాటిలో పునరుత్పత్తి కాకుండా వెటర్నరీ డాక్టర్, సిబ్బంది ఆపరేషన్లు చేసి నాలుగు రోజులు వారి పర్యవేక్షణలో ఉంచి తిరిగి ఎక్కడి నుండి తెచ్చారో అక్కడే వదిలేయటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత వెటర్నరీ వైద్య సిబ్బంది, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

హోలీ సంబురాలు



నవతెలంగాణ - మాక్లూర్

మండల కేంద్రంలో సోమ వారం యువకులు, చిన్నారులు, మహిళలు హోలీ పండుగను ఘనంగా జరుపు కున్నారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కామ దహనం చేశారు. గ్రామంలో ఇంటింటికీ డప్పులతో వెళ్లి పిడుకలు, కట్టెలను జమ చేసి రాత్రి ప్రధాన కూడలిలో కామ దహనం చేశారు. కార్య క్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు ప్రసాద్ గౌడ్, స్థానిక సర్పంచ్ అశోక్ కుమార్, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విజయ్ హైస్కూల్ కరస్పాండెంట్‌కు సన్మానం



కరస్పాండెంట్ ప్రభాదేవిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇందూరు అపురూప అవార్డును అందుకున్న విజయ్ హైస్కూల్ కరస్పాండెంట్ ప్రభాదేవిని పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. వివిధ రంగాలలో విశేష కృషి చేసిన నిష్ణాతులైన వారికి ఇచ్చే ఇందూరు అపురూప అవార్డును దర్శకత్వ విభాగంలో ప్రభాదేవి అందుకున్నారు. కార్యక్రమంలో ప్రభాదేవి మాట్లాడుతూ.. నాటిక దర్శకత్వంలో తెలుగు, ఇంగ్లీషు ఉపాధ్యాయుల సహకారం వల్లనే ఈ విభాగంలో రాణించానని, తనలో ఉన్న ప్రతిభను గుర్తించి ఓనమాలు దిద్దించి దర్శకత్వ బాధ్యతలు అప్పగించి ఎప్పటికప్పుడు లోపాలను సవరిస్తూ మెలకువలు నేర్పించి ముందుకు నడిపించిన అమృతలతకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తూ భావోద్వేగానికి గురయ్యారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్ట ర్ వసంత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ సుజాత, ప్రిన్సిపల్ విజేత, ఉపాధ్యాయ బృందం సిబ్బంది. పాల్గొన్నారు.

పిప్రిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



మహిళలను సన్మానించిన దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని పిప్రి గ్రామంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆశాపురం దేవి తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆశాపురం శ్రీనివాస్ రెడ్డి, అంగన్వాడి సూపర్వైజర్ వెంకట రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవ కోసమే మేమున్నాం..

- ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతిమా
- 11, 33 కేవీ వైర్ల తొలగింపునకు ప్రొసీడింగ్ కాపీ అందజేత



ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి

నవతెలంగాణ-నవీపేట్

ప్రజలకు సేవ చేసేందుకే ఎమ్మెల్యే షకీల్ ఆమేర్, తాను ఉన్నామని ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతిమా అన్నారు. మండల కేంద్రంలోని సుభాష్ నగర్‌లో ఎంపీటీసీ మీనా నవీన్ రాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో 11 కెవి, 33 కెవి విద్యుత్ వైర్లను తొలగించేందుకు 11 లక్షల అరవై ఒక్క వెయ్యి ప్రొసీడింగ్ కాపీని ఎంపీటీసీ మీనా నవీన్ రాజ్‌కు సోమవారం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతిమా మాట్లాడుతూ.. కొన్ని దశాబ్దాలుగా పరిష్కారం కానీ విద్యుత్ హై టెన్షన్ వైర్లను తొలగించాలని ఎంపిటిసి మీనా నవీన్ రాజ్‌కు చాలాసార్లు వినతులు అందించారని గుర్తు చేశారు. తమ దశాబ్దాల సమస్యను పరిష్కరించినందుకు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రొసీడింగ్ కాపీని అందజేసినందుకు ఎంపీటీసీ మీనా నవీన్ రాజ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏటీఎస్ శ్రీనివాస్, ఎంపీపీ సంగెం శ్రీనివాస్, నర్సింగ్ రావు, చైర్మన్ అబ్బన్న, బుచ్చన్న, బాబర్, ఉమర్, అప్సర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించడం మన సంప్రదాయం

- హెూవార్డ్ పాఠశాల ప్రిన్సిపాల్



కేక్ కట్‌చేస్తున్న మహిళలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

మహిళలను గౌరవించడం మన సంప్రదాయం అని హెూవార్డ్ పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ టీఎస్ శశికళ అన్నారు. రోటరీ నగర్ నందు గల హెూవార్డ్ పాఠశాల ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. పాఠశాల విద్యార్థుల తల్లులను ఆహ్వానించి వారికి వంటలు, తంబోలా పోటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ మాట్లాడుతూ.. అందరూ చైతన్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహించామన్నారు. రోజువారీ పనులు, కార్యక్రమాలతో అలసిపోతామని, కాస్త విజ్ఞానం, ఆనందంతో ఉన్నట్లయితే శరీరానికి ఇంకాస్త శక్తి వస్తుందని అన్నారు. కరస్పాండెంట్ టీవీఆర్ మూర్తి మాట్లాడుతూ.. ఎక్కడైతే మహిళలు గౌరవించ బడతారో అక్కడ సాంప్రదాయమైన వాతావరణం ఏర్పడు తుందని తెలిపారు. అందుకే భారతదేశ సాంప్రదా యమైన దేశంగా ఉంటుందని, పాఠశాలలో కూడా ఇలాంటివి ప్రతి యేడు నిర్వహిస్తామని , గౌరవిస్తామని అన్నారు. వంశీ ఇంటర్నేషనల్ హెూటల్ నుండి చెఫ్, మేనేజ్మెంట్ ప్రతినిధులు న్యాయ నిర్ణయితలుగా విచ్చేసి విజేత లను ప్రకటించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ లక్ష్మీ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కేక్ ని కట్ చేసి బహుమతులను కూడా అందించారు.

స్మైల్ పాఠశాలలో డెంటిస్ట్ డే



డెంటిస్ట్‌లో డేలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఇంటర్నేషనల్ డెంటిస్ట్ డే సందర్భంగా సోమవారం ప్రణతి డెంటల్ క్లినిక్, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ డెంటిస్ట్ డే సందర్భంగా స్మైల్ పాఠశాలలో డెంటల్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్‌ను డాక్టర్ హనుమంత్‌రెడ్డి, ఎమ్‌డిఎస్ అండ్ డాక్టర్ ప్రణతి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. 150మంది పిల్లలను చెకప్ చేసి వారికి దంతలను సురక్షితంగా ఉంచడానికి మందులు అందజేశారు. క్యాంప్ నిర్వహించినందుకు స్మైల్ స్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపల్ షబానా, డైరెక్టర్ రఫీ, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ స్టాఫ్ సవిత, ప్రసన్న, సింధూర, సంతోషిని, లలిత, విముల, జోష్ణ పాల్గొన్నారు.

మహిళా సాధికారత ఎంతో అవసరం



మాట్లాడుతున్న వివి ప్రసాద్‌రావు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

మహిళా సాధికారత నేటి సమాజానికి ఎంతో అవసరమని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు వివి ప్రసాద్‌రావు అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో హాస్టల్ వార్డెన్ సుమలత అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'మహిళా సాధికారికత' అనే అంశం పై ఉపన్యాసం పోటీలు సుభాష్ నగర్‌లోని ఎస్సీ గర్ల్స్ హాస్టల్‌లో నిర్వహించినట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కొయ్యడ నర్సింలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వివి ప్రసాదరావు మాట్లాడుతూ.. సమానత్వం అనేది మన ఇంట్లో నుండే ప్రారంభం కావాలని అన్నారు. మెప్మా రిసోర్స్ పర్సన్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షురాలు స్వర్ణలత మాట్లాడుతూ మహిళలపై లైంగిక దాడుల, అఘాయిత్యాలు ఆగడం లేదని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు కోయేడీ నర్సింలు మాట్లాడుతూ.. సామాజిక విజ్ఞానం, పాజిటివ్ థింకింగ్ అలవరుచుకుంటే ఏదైనా ఎదుర్కోవచ్చని వివరించారు. విజేతలుగా ముగ్గురిని ఎంపిక చేశామన్నారు. ప్రథమ, మహిళా దినోత్సవం రోజున బహుమతి ప్రధానోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు వివి ప్రసాద్ రావు మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా సామాజికంగా అన్ని రంగాలలో రాణిస్తున్నారని, అలాగే ఆమె చేసే ప్రతి పనికి సమానంగా పురుషుడు కూడా చేసినప్పుడే మహిళకు సమానత్వం ఉంటుందని అన్నారు.

ప్రజా సంక్షేమమే ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ధ్యేయం

- రాష్ట్ర ఆవిర్భావానికి ముందునుంచే ప్రజల పక్షాన పోరాటం
- నేడు ఎమ్మెల్యే పుట్టినరోజు



నవతెలంగాణ-ఆర్మూర్

ఆర్మూర్ ఎమ్మెల్యేగా టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షునిగా పీయూసీ చైర్మన్‌గా ఉన్నత పదవులు పొందిన ఆశన్నగారి జీవన్ రెడ్డి తెలంగాణ ఆవిర్భావానికి ముందు నుంచి ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారు.

ప్రజాసేవలో కుటుంబీకులు..

వేల్పూర్ మండలంలోని జానకంపేట గ్రామానికి చెందిన వెంకట రాజన్న, రాజు భాయ్ దంపతులకు 1976 మార్చ్ 7న జన్మించారు. వీరి తండ్రి జానకంపేట గ్రామ ఉపసర్పంచిగా సేవలందించారు. జీవన్‌రెడ్డి ప్రాథమిక విద్యాభ్యాసం గోవింద్‌పేట్ గ్రామంలో కొనసాగింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి న్యాయవాదిగా పట్టభద్రులయ్యారు. జిల్లా బార్ కౌన్సిల్ సభ్యునిగా పని చేశారు. వీరి మేనమామ కీ.శే. యాల రాములు ఎంపీపీగా పట్టణ ప్రజలకు సైతం సేవలు అందించారు. ఎమ్మెల్యే సతీమణి రజితరెడ్డి, సోదరుడు రాజేశ్వర్ రెడ్డి సైతం ప్రజాసేవలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారు.

అభివృద్ధిలో ఆర్మూర్...

రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో పాటు పట్టణం నుండి పెర్కిట్ వరకు సెంట్రల్ లైటింగ్, ఆర్మూర్ నుండి నందిపేట్ వరకు బీటీ రోడ్డు, ఆలూరు నుండి ఆర్మూర్ వరకు యాల రాములు బైపాస్ రోడ్డు, సిద్దలగుట్టకు ఘాట్ రోడ్ వేయించారు. మాక్లూర్‌లో అర్బన్ పార్కు, ఉమ్మెడ బ్రిడ్జి, కొత్త మండలాల ఏర్పాటు, సిద్దుల గుట్టపై నిత్య అన్నదానం, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల అభివృద్ధి, ఇంటింటికి మంచినీళ్ల ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేయించారు. మళ్లీ ఎన్నికల్లో గెలుపొందడం ఖాయమని స్థానికులు అంటున్నారు.

నేడు అంకాపూర్‌లో పుట్టినరోజు వేడుకలు

ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వ్యయ ప్రయాసలకోర్చి రాత్రిపూట ప్రయాణం చేసి హైదరాబాద్ నివాసానికి వెళ్ళవద్దని, అంకాపూర్ వారి స్వగృహంలోని పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్నట్టు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆశన్న గారి రాజేశ్వర్ రెడ్డి, నాయకులు పండిత్ పవన్, ప్రేమ్, మల్లారెడ్డి, 31వ వార్డు కౌన్సిలర్ స్వాతి సింగ్ బబ్లు తెలిపారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలకు కులసంఘాలకు ఆహ్వానం



నేడు నిర్వహించే ఎమ్మెల్యే జన్మదిన వేడుకలకు కుల సంఘాలు అందరికీ ఆహ్వానం అందజేసినట్టు బీఆర్ఎస్ నాయకులు పండిత్ పవన్, తొమ్మిదవ వార్డు కౌన్సిలర్ కోనపత్రి కవిత కాశీరాం సోమవారం తెలిపారు. మున్సిపల్‌లో విలీనమైన మామిడిపల్లి, పెర్కిట్ లను అభివృద్ధి పదంలో ముందు ఉంచుతున్న ఎమ్మెల్యే పుట్టినరోజుకు ప్రతి ఒక్కరు హాజరు కావాలని వారు కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మేడిదాల రవి గౌడ్, వీడీసీ అధ్యక్షులు వెల్మల మహిపాల్, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

10న జిల్లా జనరల్ కౌన్సిల్‌ను విజయవంతం చేయండి

- ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య

నవతెలంగాణ-మాక్లూర్

అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకెఎమ్మెస్) నిజామాబాద్ జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 10న నిజామాబాదు జిల్లా కేంద్రంలో ఎంఆర్ భవన్ లో నిర్వహించబోతున్నామని జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య శుక్రవారం తెలిపారు. ఈ సమావేశానికి 18 రైతు కూలీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. మండల సమావేశం కృష్ణాగౌడ్ లో కలిసి మాక్లూర్ మండలం బోర్గం (కె) గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో భూమయ్య మాట్లాడుతూ.. గత మహాసభలో తీసుకున్న కర్తవ్యాలను సమీక్షించుకొని రాబోవు రోజులు రైతాంగ సమస్యలపై వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై సుదీర్ఘంగా చర్చిస్తామని, తగిన కర్తవ్యాలు రూపొందించుకోవడానికి ఈ కౌన్సిల్ ఉపయోగపడుతుందని అన్నారు. సమావేశంలో ఏఐకేఎమ్మెస్ మండల అధ్యక్షులు కృష్ణాగౌడ్, బన్సీ, శంకర్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో విన్నర్‌గా మేనేజ్‌మెంట్ జట్టు

నవతెలంగాణ-మద్నూర్
మండల కేంద్రంలో ఎంపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించగా సోమవారం ఫైనల్ మ్యాచ్ మేనేజ్‌మెంట్ టీం, గోశాల టీం తలపడ్డాయి. ఈ ఫైనల్ మ్యాచ్లో మేనేజ్మెంట్ టీం విన్నర్‌గా నిలిచింది. గోశాల టీం రన్నర్‌గా నిలిచింది. ఫైనల్ మ్యాచ్ అనంతరం రెండు జట్లకు నగదుతో పాటు బహుమతులను అందజేశారు. కాగా సర్పంచ్ సురేష్, ఉప సర్పంచ్ విట్టల్, మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు డాక్టర్ బండి వార్ విజయ్, అయ్యప్ప గురు స్వామి చౌలవార్ హనుమాన్లు, బీజేపీ నాయకులు కృష్ణ పటేల్, చాట్ల హనుమాన్లు, బీఎస్పీ పార్టీ మండలాధ్యక్షులు కర్రేవార్ రాములు బహుమతులను అందజేశారు.

సరోజనమ్మకు గవర్నర్ సన్మానం

నవతెలంగాణ-కంఠేశ్వర్



తెలంగాణ ఆల్ పెన్షనర్స్ యూనియన్ బోధన్ డివిజన్ గౌరవాధ్యక్షురాలు, సామాజిక సేవ కార్యకర్త గుర్రాల సరోజనమ్మను సోమవారం రాజ్‌భవన్‌లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళసై ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా రాజ్ భవన్లో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది.

రైతు క్షేత్ర దినోత్సవం

నవతెలంగాణ-రాజంపేట
మండలంలోని శివాయిపల్లి గ్రామంలో వ్యవసాయ పంట పొలాలను వ్యవసాయ అధికారులు సోమవారం పరిశీలించారు. గ్రామంలో రైతులకు కేంద్ర సమగ్ర సస్యరక్షణ కేంద్రం హైదరాబాద్ వారి అధ్వర్యంలో మొక్కజొన్న పంట గురించి రైతు క్షేత్ర పాఠశాల (14వ వారం) నిర్వహించారు. ఈ యాసంగిలో ఆశించే చీడ పీడలు, తెగుళ్ళ తీవ్రత ఎక్కువగా ఉంటుంది గనుక ఎప్పటికప్పుడు రైతులు పురుగుల ఉనికిని గమనించాలని శాస్త్రవేత్త రవిశంకర్ వివరించారు. కేంద్ర సమగ్ర చీడపీడల సంస్థ హైదరాబాద్ నుంచి వచ్చిన డా.కృష్ణారెడ్డి ఐపీయం కిట్‌ల గురించి క్లుప్తంగా వివరించారు. అలాగే కత్తెర పురుగు నివారణ విషపు ఎర తయారీ విధానం, పురుగు పెద్దగా ఉన్నప్పుడు 10 కేజీల తవుడు, 2కిలోల బెల్లం, 2లీటర్ల నీరు కలిపి 24 గంటలు పాటు ఉంచిన తర్వాత 100 గ్రాముల తయోడికర్బ్ అనే మందును కలిపి సాయంత్రం వేళలో మొక్క సుడులలో వేయాలని అన్నారు. కామారెడ్డి డివిజన్ వ్యవసాయ సంచాలకులు శ్రీమతి అపర్ణ మాట్లాడుతూ ముఖ్యంగా మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు యాజమాన్య పద్ధతులు గురించి చర్చించారు. పురుగు గమనించిన వెంటనే గుడ్ల సముదాయం ఏరి వేసి, వేప నూనె పిచికారీ చేయాలని, ఆకులు, సుడులు కండెల మీద ఉన్న లార్వాలను ఏరి నాశనం చేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారి రాధ రైతులకు మిత్ర పురుగుల అవశ్యకత, ఉపయోగాల గురించి రైతులకు వివరించారు. అలాగే పంచగవ్య తయారీ విధానం తెలిపారు. రైతులకు పురుగు మందులు పిచికారీ చేసేటప్పుడు కావాల్సిన జాగ్రత్తలు, కిట్‌ను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విఠల్‌రెడ్డి, ఎంపీటీసీ బాలరాజుగౌడ్, ఆనంద్‌రావు, రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-రామారెడ్డి
మండలంలోని అన్నారం గ్రామంలో సోమవారం సీసీ రోడ్డు పనులను సర్పంచ్ కూడెల్లి అమృత స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, స్థానిక ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి సహకారంతో గ్రామంలోని ఏడో వార్డులో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల యూత్ ప్రెసిడెంట్ గడ్డం రవీందర్‌రెడ్డి, కూడెల్లి బాలరాజు, సంజన రజినీకాంత్, దేవదాసు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-రామారెడ్డి
మండల కేంద్రానికి చెందిన తోకల బాలయ్య మరణించగా బాధిత కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలుసుకున్న నారెడ్డి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి స్పందించి బాధిత కుటుంబాన్ని సోమవారం ఫోన్‌లో పరామర్శించి, ఆయన ఆదేశాల మేరకు కుటుంబానికి రూ.2వేలు, 50 కేజీల బియ్యాన్ని ఎస్సీ సెల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మద్దెల భాగయ్య, స్థానిక కార్యకర్తలతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చింతకుంట కిషన్, నామాల రవి, బిట్ల నర్సింగరావు, బట్టు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు పోటీలు

నవతెలంగాణ-బోధన్
అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని బర్దిపూర్ గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళలకు వీల్ చైర్ ఆటను సోమవారం నిర్వహించారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోపి లక్ష్మి మహిళల హక్కులు, చట్టాలపై వారికి అవగాహన కల్పించారు. ఆటలు విజేతలయిన వారికి ఆమె బహుమతులు అందించారు. సర్పంచ్ సాయరెడ్డి, అంగన్వాడీ టీచర్ చంద్రకళ, మహిళలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలన



జుక్కల్: పనులను పరిశీలిస్తున్న ఏఈ,సర్పంచ్

నవతెలంగాణ-మద్నూర్/జుక్కల్
మద్నూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో గల టీచర్స్ కాలనీ హౌసింగ్ బోర్డ్ కాలనీలో రూ.10 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ సురేష్, ఉప సర్పంచ్ విట్టల్, ఆ వార్డు సభ్యులు సాయిలుతో కలిసి సోమవారం పరిశీలించారు. నిర్మాణం పనుల్లో నాణ్యత లోపం లేకుండా చూసుకోవాలని సూచించారు.

జుక్కల్:మండలంలోని బిజ్జల్‌వాడి జీపీలో సీసీ రోడ్డు పనులను పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ గౌళే యాదవ్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్ఆర్ఈజీఎస్ రూ.10లక్షల వ్యయంతో నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ, మాజీ విండో చైర్మెన్ రాజుపటేల్, ఎఫ్ఏ హన్మంత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో కంటి వెలుగు

నవతెలంగాణ-వర్ని
మోస్రా మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో సర్పంచ్ సున్నం భూమయ్య అధ్యక్షతన కంటి వెలుగు కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని చూపును పొందాలన్నారు. దగ్గర చూపు, దూరపు చూపు కంటి అద్దాలను కూడా ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుందని తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనుల్లో నాణ్యత లోపం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి
ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కమిటీ సముదాయాన్ని బీజేపీ నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. మున్సిపల్, మార్కెట్ కమిటీ డబ్బులతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కమిటీ పనులు పూర్తి గా నాణ్యత ప్రమాణాలు పాటించటం లేదని వారు ఆరోపించారు. ఈ విషయం పై సదరు కాంట్రాక్టర్‌ని అడగగా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఈ విషయంలో ఏఈ చొరవ తీసుకొని నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా సదరు కాంట్రాక్టర్‌ను ఆదేశించాలని అన్నారు. అదేవిధంగా నిర్మిస్తున్న మార్కెట్ సముదాయంలో ఇసుక, సిమెంట్, ఐరన్ సరిగా వాడటం లేదని వీటిపై వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు ప్రశాంత్ గౌడ్, విద్యాసాగర్, రాజేష్, మంగలి సతీష్, ప్రవీణ్, అనిల్ నాయక్, సాయి బాబా తదితరులు పాల్గొన్నారు.

లింబాద్రి గుట్టను సందర్శించిన ఆకుల లలిత

నవతెలంగాణ-భీంగల్
మండలంలోని లింబాద్రి గుట్టపై గల లక్ష్మీనరసింహ స్వామిని రాష్ట్ర మహిళ సంక్షేమ బోర్డు చైర్మన్ ఆకుల లలిత కుటుంబ సమేతంగా సోమ వారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు జరిపించారు. అనంతరం ఆమెను ఆలయ అర్చకులు సన్మానించారు.

ఘనంగా హోలీ సంబురాలు



వర్ని : హోలీ వేడుకల్లో యువకులు



లింగంపేట్ : సజ్జన్‌పల్లి పాఠశాలల్లో..



బోధన్‌లో..

నవతెలంగాణ-విలేకరుల బృందం
బోధన్ : సాలురా మండల కేంద్రంలో సోమవారం హెూలీ సంబురాలను గ్రామస్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో సారగామ దేవత ఉన్నందున ఒకరోజు ముందుగా ఆదివారం రాత్రి కామ దహనం జరిపి మరసటి రోజున హెూలీ సంబరాలు జరుపుకుంటారని గ్రామపెద్దలు బి.వెంకట్ పటేల్, బుద్దె రాజేశ్వర్ తెలిపారు. గ్రామంలో ఉన్న యువకులు, మహిళలు, నాయకులు కులమతాలకతీతంగా ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ, హెూలీ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అలయ్ బలయ్ చేసుకొని పండుగ జరుపుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షులు అల్లె జనార్ధన్, గ్రామపెద్దలు సురేష్ పటేల్, కండెల సంజీవ్, బాసరే శివకాంత్ పటేల్, ఇల్తెపు రమేష్, కన్నె అశోక్, కల్లూరు లక్ష్మణ్, లింబూర్ లక్ష్మణ్, యువకులు పాల్గొన్నారు.

పిట్లం : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో సోమవారం హెూలీ సంబురాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సజ్జనపల్లి పాఠశాలలో.
లింగంపేట్ :
మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల సజ్జన్‌పల్లిలో హెూలీ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదర్ మాట్లాడుతూ.. సహజ సిద్ధమైన రంగులతో విద్యార్థులు హెూలీ వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మ, బన్సీ, సంగమేశ్వర్ విద్యార్థులు పాల్గొన్నారు.



నందిపేట్ : నికాల్‌పూర్‌లో హోలీ వేడుకల్లో చిన్నారులు



పిట్లంలో చిన్నారుల సందడి

పాఠశాలల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి

నవతెలంగాణ-దోమకొండ
పాఠశాలల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎంపీపీ శారదా, సర్పంచ్ సలీమ్ అన్నారు. మండలంలోని అంబారిపేట గ్రామంలోని జడ్పీహెచ్‌యస్ పాఠశాలకు 'మన-ఊరు మనబడి' కార్యక్రమం ద్వారా పాఠశాలలో అదనపు గదులు అభివృద్ధికి మంజూరైన రూ.88.లక్షలతో నిర్మాణం చేపట్టనున్న భవన నిర్మాణం సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ శారదా, సర్పంచ్ సలీమ్ మాట్లాడుతూ.. పాఠశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం మన ఊరు మన బడి పథకం ద్వారా నిధులు మంజూరు చేస్తుందని, ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ కృషితో గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. అనంతరం గ్రామంలో ఎన్ఆర్ఈజీయస్ ద్వారా మంజూరు అయినా రూ.20లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, శారద-నాగరాజు, ఎంపీటీసీ రాజేశ్వర్, సర్పంచ్ ఎండీ సలీమ్, స్కూల్ ఏఎంసీ చైర్మన్ పల్లె మల్లేశం, ఉపాధ్యాయులు అనంతరావు, వార్డుమెంబర్ శేఖర్, ఎంపీడీఓ చెన్నరెడ్డి, ఎంపీవో తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి అంజిబాబు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయ భూములు కౌలుకు వేలం పాట

- రూ.1,63,500 ఆలయానికి ఆదాయం

నవతెలంగాణ-మద్నూర్
మద్నూర్ మండల కేంద్రంలో గల లక్ష్మి నారాయణ ఆలయ భూములు ఆలయ కమిటీ చైర్మన్ చాట్ల గోపాల్, ఎండోమెంట్ అధికారి వేణు ఆధ్వర్యంలో సోమవారం ఆలయ ఆవరణంలో వేలం పాట నిర్వహించారు. ఈ వేలంపాటలో గ్రామ వ్యవ సాయదారులు పాల్గొని మూడు చోట్ల ఉన్న భూములకు కౌలుకు తీసుకున్నారు. ఒకచోట ఉన్న భూమికి రూ.47 వేలు కౌలు రాగా, మరొకచోట ఉన్న భూమికి రూ.77 వేలు, ఇంకొక చోట గల భూమికి రూ.21 వేలు కౌలు వచ్చింది. ఈ భూములపైన ఆలయానికి రూ.లక్ష 45 వేలు ఆదాయం రాగా ఆలయానికి గల రెండు టీం షెడ్లకు కలిసి రూ.18,500 అద్దె రూపంలో వేలం పాటలు దక్కించుకున్నారు. శ్రీ లక్ష్మీ నారాయణ ఆలయ భూములకు గానూ బండివార్ లక్ష్మణ్, పాకల్ వార్ విజయ్ కుమార్, జ్ఞానేశ్వర్ భూముల వేలాన్ని దక్కించుకోగా, రెండు టీం షెడ్డు గదులను నాగేష్, పాకల సాయిలు దక్కించుకున్నట్టు ఎండోమెంట్ అధికారి వేణు తెలిపారు. ఆలయానికి మొత్తం 1,63,500 ఆదాయం చేకూరినట్టు ఎండోమెంట్ అధికారి వేణు, ఆలయ కమిటీ చైర్మన్ చాట్ల గోపాల్ తెలిపారు.



కౌలుపత్రాలను అందజేస్తున్న దృశ్యం

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన రిజిస్ట్రార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి
తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో సోమవారం ఉదయం జరిగిన ఎంబిఎ, ఎంసిఎ 3వ సెమిస్టర్, రెగ్యులర్ పరీక్షలో 462మంది విద్యార్థులకు గాను 435మంది హాజరయ్యారని, 27 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ఎంబిఎ ఎంసిఎ 1వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష లో 562మంది నమోదు చేసుకోగా 528మంది హాజరయ్యారని, 32మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని అన్నారు. ఉదయం జరిగిన ఎల్ ఎల్ బి 3వ సెమిస్టరు రెగ్యులర్ పరీక్షలో 36మంది విద్యార్థులకు గాను 24 మంది పరీక్ష కు హాజరు కాగా, 12మంది గైర్హాజర్ అయ్యారని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ఎల్ ఎల్ బి 5వ సెమిస్టరు రెగ్యులర్ పరీక్షలో 24 మంది విద్యార్థులకు గాను 21 మంది పరీక్షకు హాజరయ్యారని చెప్పారు. యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ భవనంలో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రాన్ని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ విద్యావర్ధిని, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ ఆరతి లు సందర్శించారు.

ముగ్గురు అనాథ ఆడపిల్లల బాధ్యత మాదే..

ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతిమా

నవతెలంగాణ-నవీపేట్
మండలంలోని పోతంగల్ గ్రామానికి చెందిన ముగ్గురు అనాథ ఆడపిల్లల బాధ్యత తామే తీసుకుంటామని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ సతీమణి ఆయేషా ఫాతిమా అన్నారు. మండలంలోని పోతంగల్ గ్రామానికి చెందిన గోసంగి కులస్తులు నవీన్ దంపతులు ఆత్మహత్య చేసుకోగా ముగ్గురు ఆడపిల్లలు నాగలక్ష్మి(9), సహస్ర(7), విష్ణు ప్రియ(4)ను ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతిమా సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముగ్గురు ఆడపిల్లలు అనాథలైన విషయం తెలిసి ఎమ్మెల్యే చాలా బాధపడ్డారని అన్నారు. వారి చదువుతోపాటు అవసరమైన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రవీందర్ రావు, నర్సింగ్ రావు, గోసంగి జిల్లా అధ్యక్షులు గంధం రాజేష్ మరియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సతీమణి

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నవతెలంగాణ-భిక్కనూర్
మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న మహిళలను ఎంపీడీవో అనంతరావు శాలువా కప్పి ఘనంగా సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీఓ ప్రవీణ్‌కుమార్, మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హైవోల్టేజ్‌తో కరెంటు మోటార్స్ దగ్ధం

నవతెలంగాణ-సదాశివనగర్
మండలంలోని భూంపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీ ఆగ్రో ఇండస్ట్రీస్‌లోని (రైస్‌మిల్)లోని కరెంటు మోటార్స్ హైవోల్టేజ్‌తో దగ్ధమైనట్టు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. మోటార్‌లు కాలిపోవడం వలన సుమారుగా రూ.2లక్షలు నష్టపోయినట్టు తెలిపారు.

సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-భిక్కనూర్
ప్రస్తుతం వేసవికాలం ప్రారంభమైనందున వడదెబ్బ, తలనొప్పి ఇతర సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి యేమిమా తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రి ఆవరణలో ఆశా డేను పురస్కరించుకొని సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి వెంకటరమణ, పీహెచ్ఎన్ జానాబాయ్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం

నవతెలంగాణ-భిక్కనూర్



మండలంలోని ఇస్సన్నపల్లి గ్రామంలో సోమవారం జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ పశు వైద్య శిబిరాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ చిట్టెడి భగవంతురెడ్డి, ఎంపీపీ గాల్‌రెడ్డి, సర్పంచ్ గుడిసె రాములు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుడిసె యాదగిరి, ఆత్మ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పురాం రాజమౌళి, డాక్టర్ సత్యనారాయణ, సర్దార్‌ఖాన్, రాజయ్య, విశ్వప్రసాద్, భిక్కనూర్ మాజీ సర్పంచ్ నాగభూషణ్‌గౌడ్, పశువైద్య సిబ్బంది అహల్య, గోపాల మిత్రులు సురేష్, మహేష్‌గౌడ్, బాబా, ప్రదీప్, మార్కెట్ కమిటీ సీఈఓ థామస్, సిబ్బంది గంగారెడ్డి రైతులు పాల్గొన్నారు.

జలాల్‌పూర్‌లో మహిళ హత్య

నవతెలంగాణ-వర్ని
తన తండ్రితో అక్రమ సంబంధం ఉన్నదన్న అనుమానంతో ఓ యువకుడు మహిళను కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ అనిల్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షహీనాభి (42) ఇద్దరు కూతుర్లతో కలిసి నివసిస్తుంది. షాహినాభికి భర్త లేకపోవడంతో ఆమె కుటుంబ మంచి చెడులను ఓ వ్యక్తి చూసుకుంటున్నాడు. కాగా ఆ వ్యక్తి కుమారుడు నిజాముద్దీన్ తన తండ్రితో అక్రమ సంబంధం ఉందన్న అనుమానంతో షహీనాభిని కత్తితో పొడిచి హత్య చేశాడు. మతురాలి కూతురు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా నిజాముద్దీన్నుఉ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అంబంలో మరో మహిళ హత్య..



మహిళ హత్యకు గురైంది. వివరాలిలా ఉన్నాయి.. రుద్రూర్ మండలం అంబం గ్రామ చెరువులో సాయిదేవా (55) అనే మహిళ మృతదేహం లభ్యమైంది. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించారు. శనివారం మతురాలు వర్నిలో కల్లు తాగి మరో ఇద్దరితో కలిసి వెళ్లినట్టు కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మతదేహం సాయిదేవాదిగా గుర్తించారు. కాగా గుర్తుతెలియని వ్యక్తులు ఆమెపై ఉన్న బంగారు ఆభరణాలను తీసుకొని హత్య చేసి చెరువులో పడేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. కాగా కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

స్వయం పాలనా దినోత్సవం



స్వయంపాలనలో విద్యార్థులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి
ఎల్లారెడ్డి మున్సిపాలిటీ కేంద్రంలోని గండి మాసానిపేట్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులు 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట రమణ, ఉపాధ్యాయులు దేవేందర్, సురేష్, ప్రకాశ్, అథిక్, విజయ శ్రీ పాల్గొన్నారు. ఉపాధ్యాయులుగా వ్యవహరించిన వారికి బహుమతులు అందజేశారు.

జాకోర గ్రామాభివృద్ధికి రూ.కోటి మంజూరు

నవతెలంగాణ-వర్ని
తెలంగాణ రాష్ట్ర శాసనసభపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి కృషితో మండలంలోని జాకోర గ్రామానికి రూ.కోటి నిధులను మంజూరు చేశారు. గ్రామస్తులు సోమవారం రైతు వేదికలో సమావేశం ఏర్పాటు చేసి ఈ నిధులను ఏయే పనులకు వాడుకోవాలనే దానిపై పట్టికను తయారు చేసుకున్నారు. గ్రామానికి కోటి రూపాయలను మంజూరు చేసిన స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు రుణపడి ఉంటామని టీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు బి.సాయిలు తెలిపారు. సమావేశంలో సర్పంచ్, మండలాధ్యక్షులు, టీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థికి సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్



తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని దక్షిణ ప్రాంగణంలో ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్స్ ఛాంపియన్ షిప్ 2022-23 జియో ఇన్ఫర్మెటిక్స్ విద్యార్థి కె.గోపాల్ చెస్ టోర్నమెంట్లో తెలంగాణ యూనివర్సిటీ తరపున గోల్డ్‌మెడల్ సాధించడం పట్ల సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కవితా తోరస్, స్పోర్ట్స్ ఇంచార్జ్ డాక్టర్ ఆర్.సుధాకర్ సోమవారం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రతిజ్ఞ, డాక్టర్.ఎస్.నారాయణ, ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఆకాంక్షల అక్షరం (?)
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
4
మంగళవారం 07 మార్చి 2023

పర్యావరణ విద్య పరీక్షకు 442 గైర్హాజరు

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

"పర్యావరణ విద్య" పరీక్షకు జిల్లాలో 442 మంది విద్యార్థులు గైర్హాజరయినట్టు జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘురాజ్ తెలిపారు. జిల్లాలో 116 పరీక్ష కేంద్రాల్లో జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు పరీక్ష పకడ్బందీగా నిర్వహించామని అన్నారు. జనరల్ విద్యార్థులు 362 మంది, ఒకేషనల్ విద్యార్థులు 80 మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు. జనరల్ విద్యార్థులు 15,192 మందికి గాను 14,830 మంది విద్యార్థులు హాజరయ్యారని అలాగే ఒకేషనల్ 2,332 మందికి గాను 2,255 మంది హాజరైనట్లు వివరించారు.

అంబులెన్స్‌లో ప్రసవం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి చెందిన రోజాకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు సోమవారం 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఆమెను అంబులెన్స్ లో నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు అధికం కావడంతో సిబ్బంది అంబులెన్స్‌లో ప్రసవం చేశారు. రోజాకు మూడవ కాన్పు కాగా మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని సిబ్బంది. ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఆర్మూర్ 108 సిబ్బంది గణేష్, అరుణ్‌ను కుటుంబ సభ్యులు, వైద్యులు అభినందించారు.

డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో

అవినీతి ఆరోపణలపై ప్రక్షాళన చేయాలి

- సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా
- కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా
- కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

డీఎంహెచ్‌ఓ సుదర్శన్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ చేయాలని, ప్రైవేట్ హాస్పిటల్స్ దోపిడీపై కఠిన చర్యలు తీసుకోవాలని, డిఎంఅండ్ హెచ్‌ఓ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిని ప్రక్షాళన చేయాలని, ప్రైవేట్ హాస్పిటల్స్, మెడికల్, ల్యాబ్, స్కానింగ్ సెంటర్ల దోపిడీపై కఠిన చర్యలు తీసుకోవాల సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నగర కార్యదర్శి ఎం.సుధాకర్ డిమాండ్ చేశారు. సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నగర కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎంహెచ్‌ఓ సుదర్శనంపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయని, సమగ్ర విచారణ జరిపించాలని తెలిపారు. అప్పటివరకు ఆయన్ను బాధ్యతల నుండి తప్పించాలని డిమాండ్ చేశారు. డిఎంఅండ్ హెచ్‌ఓ కార్యాలయం ద్వారా జరిగిన అన్ని నియామకాలపై విచారణ జరిపించాలని అన్నారు. అద్దె వాహనాల భాగోతంపై విచారణ చేయాలని, నిజాయితీగా పనిచేసిన వాహన యజమానుల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని, సక్రమంగా నడిపి తొలగింపుకు గురైన వారి వాహనాలు తిరిగి అద్దెకు పెట్టించాలని అన్నారు. విధులు నిర్వహించకుండా వేతనాలు పొందుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అక్రమంగా చెల్లించిన వేతనాలను రికవరీ చేయించాలన్నారు. అధికారుల కుటుంబ సభ్యుల, బినామీ పేర్లతో కొనసాగుతున్న అద్దె వాహన ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.గణేష్, నగర అధ్యక్షులు అషుర్, నగర ఉపాధ్యక్షులు మహిపాల్, ప్రజాపంథా నాయకులు విఠల్, కిరణ్, సమీర్, ఫారూఖ్, ఆసిఫ్, గంగాధర్, రమేష్, గోపి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు


కలెక్టర్‌కు వచ్చిన మందర్నా గ్రామస్తులు

మెయిన్ రోడ్డులో కల్లు దుకాణంను తొలగించండి

ఎడపల్లి మండలంలోని ధర్మారం గ్రామానికి వెళ్ళే మెయిన్ రోడ్ లో గల కల్లు దుకాణం తొలగించాలంటూ ధర్మారం గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్ కార్యాలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఎంఎస్సీ ఫారం వాళ్ళు ధర్మారం గ్రామానికి పోయే రోడ్డులో కల్లు దుకాణం ఏర్పాటుచేయడంతో తమఊరి మహిళలకు ఇబ్బందికరంగా ఉందని అన్నారు. కాలేజి అమ్మాయిలు ఇంటికి వచ్చే టైంలో మద్యం మత్తులో అసభ్యంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఈ కల్లు దుకాణం తొలగించాలంటే ఎంఎస్సీ ఫారం గౌడ కులస్తులు, గ్రామస్తులు ఎదురుదాడికి దిగుతున్నారని తెలిపారు. దీనిపై ఎడపల్లి ఎస్ఐ, బోధన్ ఎక్సైజ్ సిఐ, ఏసీపీ ని సంప్రదించిన ఎటువంటి న్యాయం జరగలేదని అన్నారు. కల్లుదుకాణం మరెక్కడైన ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో సుమారు 150 మంది గ్రామస్తులు పాల్గొన్నారు.



కల్లుదుకాణం తొలగించాలని వచ్చిన ధర్మారం గ్రామస్తులు

భూమి కబ్జా చేసేందుకు యత్నిస్తున్నరు

పంట సాగు చేసుకునే పొలంలోకి కొందరు వ్యక్తులు వచ్చి ఇబ్బంది పెడుతూ కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని మందర్న గ్రామస్తులు ఆరోపించారు. సాలుర మండలం మందర్న గ్రామానికి చెందిన రైతులు కొందరు సోమవారం కలెక్టర్ కార్యాలయానికి తరలివచ్చారు. ప్రజవాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 సంవత్సరాల నుండి ఉన్న భూమిలో పంట సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ఈ స్థలానికి కొందరు వ్యక్తులు కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారు అని అన్నారు. కార్యక్రమంలో సుమారు 30 రైతులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు తూంపల్లి విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-సిరికొండ

జనవరి నెలలో జరిగిన సబ్ జూనియర్ బాలుర రాష్ట్ర స్థాయి హాకీ పోటీలలో, అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విశాల్, టి. లోకేష్ జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని సోమవారం వ్యాయామ ఉపాధ్యాయులు నగేష్, ప్రధానోపాధ్యాయులు సైరా సత్యం అభినందించారు. రంగారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని, అదేవిధంగా జాతీయస్థాయి హాకీ పోటీలు ఒడిశా రాష్ట్రంలో జరగనున్నాయని తెలిపారు. అక్కడ కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, పాఠశాలకు, గ్రామానికి, ఉపాధ్యాయ బృందానికి పేరు ప్రతిష్టలు తేవాలని వారు కోరారు. సర్పంచ్ పల్లె బాలమణి మల్లేష్, ఎంపీటీసీ లింగం, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ లావణ్య, గ్రామ అభివృద్ధి కమిటీతోపాటు నిజామాబాద్ హాకీ అసోసియేషన్ అధ్యక్షులు విశాఖ గంగారెడ్డి, ఉపాధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి, సెక్రటరీ రమణ, ట్రెజరర్ సురేందర్ విద్యార్థులను అభినందించారు.

ప్రతీ మంగళవారం స్త్రీలకు ప్రత్యేక వైద్యాన్ని అందించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు


వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-మెండోర

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం సందర్శించారు. ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ వైద్య సిబ్బందికి సూచనలిచ్చారు. మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని స్త్రీలకు ప్రత్యేక వైద్యాన్ని అందించాలని సూచించారు. ప్రతీ మంగళవారం పిహెచ్‌సీలో స్త్రీలకు సంబంధించిన ఓరల్ బ్రెస్ట్ సర్వైజికల్ క్యాన్సర్, పోషక ఆహార లోప వ్యాధులు, పీసీఓడి, మెనోపాజ్, ఎస్‌టిడి (సెక్సువల్ ట్రాన్స్ మిషన్ డీసీస్)లకు ప్రత్యేక వైద్యాన్ని అందించాలని కోరారు. ఈ అవకాశాన్ని పిహెచ్ సి పరిధిలోని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ చంద్రశేఖర్, డీఎంహెచ్‌ఓ సుదర్శన్ , డిప్యూటి డిఎంహెచ్‌ఓ, సీహెచ్‌ఓ , హెచ్‌ఈఓ , పిహెచ్‌సి సూపర్వైజర్ భీమన్న, వైద్య సిబ్బంది ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఆర్మూర్

నేడు నిర్వహించే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలని కౌన్సిలర్లు వరలక్ష్మి, లింబాద్రి గౌడ్, అల్జాపూర్ రేవతి గంగాధర్, కోన పత్రి కవిత కాశిరాం, ఇట్టెడి నర్సారెడ్డి, ఇంతియాజ్ హుస్సేన్, వనం శేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బడుగు బలహీన పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని మనసారా కోరుకుంటున్నామని పేర్కొన్నారు.

విజయ్ హైస్కూల్లో డెంటల్ క్యాంప్


డెంటల్ క్యాంప్‌లో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

వరల్డ్ డెంటిస్ట్ డే సందర్భంగా ఇండియన్ డెంటల్ అసోసియేషన్స్ నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో విజయ్ హైస్కూల్లో వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ శిబిరంలో భాగంగా సుమారు 200 మంది విద్యార్థులకు, 50కి పైగా ఉపాధ్యాయులకు, సిబ్బందికి వివిధ రకాల పరీక్షలను నిర్వహించారు. దంత సంరక్షణ పై అవగాహన కల్పించి, తగిన సూచనలు ఇచ్చారని పాఠశాల అకడమిక్ డైరెక్టర్ వసంత తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్. విజయ్ డాక్టర్ శిల్పా చౌహాన్, డాక్టర్ సంతోష్ కుమార్, డాక్టర్ కృష్ణతేజ, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

శ్రీ విద్య పాఠశాలలో హెూలీ సంబరాలు

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని శ్రీవిద్య పాఠశాలలో సోమవారం హెూలీ సంబరాలు జరుపుకున్నారు, ఈసందర్భంగా చిన్నారులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు రంగులు పూసుకొని ఆనందోత్సవాల్లో మునిగి తేలారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోజురి సాయి కృష్ణ, చైర్మెన్ గోజురి నడిపి గంగాధర్, ఉపాధ్యాయులు మనోజ్ఞ, మమత, మానస, శ్వేత, సుప్రియ, కృష్ణ వేణి, విద్యార్థులు పాల్గొన్నారు,

కంటి వెలుగుకు మంచి ఆదరణ

- ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి



నవతెలంగాణ ధర్పల్లి

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమానికి పల్లె ప్రజల నుండి మంచి ఆదరణ లభిస్తుందని ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి అన్నారు. సోమవారం ఆమె మండలంలోని దుబ్బాక గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల ప్రజలు పట్టణాలకు కంటి వైద్యానికి వెళ్లి ఇబ్బందులు ఎదురుకోకుండా ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న శిబిరాల్లో పరీక్షలు చేయించుకొని అవసరము ఉన్న వారికీ ప్రభుత్వం కంటి అద్దాలను అందించడం ద్వారా పేద ప్రజలకు ఏంటో మేలు జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్మూర్ పెద్ద బాల్ రాజ్, ఉప సర్పంచ్ పిప్పెర ప్రతాప్ గౌడ్, ఎంపీటీసీ గంగాధర్, గ్రామాభివృద్ధి అధ్యక్షుడు నూకల రమేష్, వార్డు సభ్యులు గోవర్ధన్ రెడ్డి, వీడీసీ సంతోష్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ లలిత, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మి, సూపర్ వైజర్, ఆశ వర్కర్లు,అంగన్వాడీ కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో గుడాల పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్


గుడాలు పంపిణీ చేస్తున్న క్షత్రియ సమాజ్‌వారు

పట్టణంలోని లక్ష్మీనారాయణ ఆలయంలో క్షత్రియ సమాజ్ అధ్యక్ష కార్యదర్శులు హజారి మదన్ మోహన్, కార్యదర్శి బారడ్ గంగా మోహన్ ఆధ్వర్యంలో క్షత్రియులకు గుడాలను సోమవారం పంపిణీ చేశారు. హెూలీ పండుగ సందర్భంగా అనాదిగా వస్తున్న ఆచారం మేరకు 14 క్వింటాళ్ల గుడాలను క్షత్రియులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఆర్మూర్, పెర్కిట్ లోని క్షత్రియుల కుటుంబాలవారు సభ్యుల సంఖ్య చెప్పి గూడాలను తీసుకెళ్లారు. వరుస క్రమంలో బారులు తీరి నిలబడి ప్రశాంత వాతావరణంలో గూడాలను తీసుకెళ్లారు. కార్యక్రమంలో క్షత్రియ సమాజ్ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఖాందేశ్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి పండిత్ ప్రేమ్, కోశాధికారి వైద్య సంజయ్, ఉపాధ్యక్షులు రెడ్డి ప్రకాష్, డీకే శ్రీనివాస్, గట్టడి కిషన్, సంయుక్త కార్యదర్శి బాదం రాజేందర్, హజారి రమేష్, షికారి శ్రీనివాస్, సంతని విజయ్, బారడ్ కిషోర్, సభ్యులు సాత్ పుతే శ్రీనివాస్, గటడి సత్యనారాయణ, పోహార్ రాజ్ కరణ్, అల్జాపూర్ హరికి ఆనంద్, జెస్సు శ్రీనివాస్, దొండి శ్రీనివాస్, గటడి గంగాధర్ బాబు, వైద్య రవీందర్, మామిడి లక్ష్మీనారాయణ, జెస్సు వినోద్, బొబిడే గంగా కిషన్, పాన్ శ్రీనివాస్, దొండి శ్యామ్, కర్తన్ రవి, గటడి పతి గంగా మోహన్, పోహార్ గంగా మోహన్, మాణిక్ ప్రవీణ్, జీకే విజయనంద్, బొచ్కర్ కోలు చంద్రశేఖర్, పోహార్ నవీన్, డీకే శ్రీహరి, ఖాందేష్ రాజేశ్వర్, ఎస్ జి రాము, జివి గౌతం, యువజన సమాజ్ మాజీ అధ్యక్ష కార్యదర్శులు జీవి ప్రశాంత్, శ్రీను రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్లుబట్టిలో వ్యక్తి హత్య

- ఇరువురి మధ్య గొడవే కారణం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని 5వ టౌన్ పరిధిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు.ఈ సంఘటన సోమవారం ఉదయం నాగారం పాత కల్లుబట్టి (వడ్డెర సంఘం)లో జరిగింది. నాగారంకు చెందిన పట్టేవార్ యాదూ(40) అదే కాలనీకి చెందిన ఠాకూర్ విక్రమ్ సింగ్ హత్య చేశాడు. ఉదయం వేళ బెల్ట్ షాపులో మద్యం కొనుగోలు చేసిన ఇద్దరు పాత కల్లు బట్టిలో మద్యం సేవించినట్టు సమాచారం. ఇద్దరి మధ్య జరిగిన గొడవలో యాదూనూ హత్య చేసినట్టు తెలిసింది. యాదును హత్యచేసి తానే అతన్ని చంపానని అతని కుటుంబ సభ్యులకు తెలిపి పోలీసులకు లొంగిపోయినట్టు తెలిసింది. కూలి పని చేసుకునే ఇద్దరి మధ్య గొడవకు కారణాలు తెలియలేదు. 5వ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.మృతుడు యాదుకు ఇద్దరు పిల్లలు కాగా భార్య పిల్లలు నాందేడ్ జిల్లాలో ఉంటున్నట్టు తెలిసింది. కూలి పనులు చేస్తూ ఆకతాయిగా వ్యవహరించే విక్రం తోటి కూలి పని చేసే వ్యక్తిని హత్య చేయడం కలకలం రేపింది.

కామ్రేడ్ రవన్న 7వ వర్ధంతి సభను జయప్రదం చేయండి

- బీజేపీ ఫాసిస్టు పాలనను నిర్మూలిద్దాం
- ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సారా సురేష్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కామ్రేడ్ రవన్న (రాయల సుభాష్ చంద్రబోస్) 7వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సారా సురేష్ అన్నారు. హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రవన్న వర్ధంతి గోడప్రతులను సోమవారం మండలకేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సారా సురేష్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంలో ఆమోదించిన కొద్దిపాటి హక్కులు కూడా ప్రశ్నార్థకంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోపక్క నిరుద్యోగం, పేదరికం, అసమానతలతో పాటు సకల రంగాల్లో సంక్షోభాలు ఎదురవుతున్నాయని అన్నారు. దాని మాటున మత ఉన్మాదం, మత విద్వేషం కట్టలు తెంచుకొని ప్రజల మీద స్వైర విహారం చేస్తూ ప్రగతి నిరోధక, సంకుచిత భావజాలం, మనుషులను ఉన్మాదులుగా మారుస్తుందన్నారు. తిండి మీద, కట్టు, బట్ట మీద, విశ్వాసాల మీద, స్వేచ్ఛ హక్కుల మీద, భావ ప్రకటనల మీద ఆంక్షలు నిషేధాజ్ఞలు విధించే పాసిస్ట్ పాలనను అంతమొందించాలని అన్నారు. కార్యక్రమంలో ప్రజాపంథానాయకులు కిషన్, సత్యక్క, అశోక్,బాలయ్య, సారా లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెండు అదనపు గదుల నిర్మాణానికి సర్పంచ్ సక్కరం అశోక్ శంకుస్థాపన చేశారు. కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ పంచాయతీ నిధులతో అదనపు గదుల నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు తోట జ్యోతి మనోహర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉప సర్పంచ్ కస్తూరి విక్రమ్, వార్డు సభ్యులు పోషన్న, సాగర్, గణేష్, ఎర్రవ్వ, లావణ్య, నీలిమ, శారదా, విజయ, గిరిజ, ఇందుమతి, నాయకులు నెల్ల రమేష్, భాశెట్టి గంగాధర్, ఆర్ పి రాజు, మహేష్ ,నర్సారెడ్డి, రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతో పనులను చేపట్టాలి

నవతెలంగాణ-భీంగల్

మన ఊరు మన బడిలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులు నాణ్యమైనవిగా ఉండాలని ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు. సోమవారం మండలంలోని బాబానగర్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో కొనసాగుతన్న పనులను పీఆర్ ఏఈ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. పనులను త్వరితగతంగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు తెలియజేశారు. పనులు నాణ్యతతో ఉండాలన్నారు. ఈయన యంఈఓ స్వామి, ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

వేముల సురేందర్‌రెడ్డి విగ్రహానికి నివాళి

- ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న మహమూద్ అలీ
- హోంమంత్రికి ఘన స్వాగతం పలికిన మంత్రి వేముల, బీఆర్ఎస్ శ్రేణులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


నివాళ్లు అర్పిస్తున్న హోంమంత్రి, మంత్రి వేముల

బాల్కొండ నియోజకవర్గ పర్యటనకు వచ్చిన రాష్ట్ర హెూంశాఖ మంత్రి మహమూద్ అలీకి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. బాల్కొండ మండల కేంద్రంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన నూతన పోలీస్ స్టేషన్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి సోమవారం వచ్చిన హెూంమంత్రి మహమూద్ అలీ హైదరాబాద్ నుండి నేరుగా వేల్పూర్‌లోని మంత్రి వేముల నివాసానికి చేరుకున్నారు. అక్కడ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి మంత్రి ప్రశాంత్ రెడ్డి స్వాగతం పలికారు. మంత్రి నివాసంలో తేనీటివిందు అనంతరం బాల్కొండకు బయలుదేరుతూ వేల్పూర్ ఎక్స్‌రోడ్ వద్ద వేముల సురేందర్ రెడ్డి విగ్రహానికి హెూంమంత్రి నివాళులు అర్పించారు. ఉద్యమంలో ఆయనతో ఉన్న అనుబంధాన్ని హెూం మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ ప్రాంత రైతాంగం కోసం విశేష సేవలు అందించిన గొప్ప నాయకుడు వేముల సురేందర్ రెడ్డి అని అన్నారు. తండ్రి ఆశయాలకు అనుగుణంగానే రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు.